# ఆత్మస్థైర్యంతో జీవితాన్ని గడపాలి

■ **సీనియర్ సివిల్ జడ్జి మాధవి**

గోవిందరావుపేట, డిసెంబర్ 2 : హెచ్ఐవీ సోకిన వ్యక్తులు వివక్షకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో మంచి జీవితాన్ని గడపాలని ములుగు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ మాధవి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ శాఖ సహకారంతో న్యాయ సేవాధికార సంస్థ హై రిస్క్ గ్రూప్‌లకు ప్రతినెలా 10 కేజీల బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు సైతం ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే సౌఖ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్, వైద్యులు చంద్రకాంత్, పవన్‌కుమార్, తిరుపతయ్య, మేకల మహేందర్, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, న్యాయవాదులు సుధాకర్, సంజీవ, ఆశ వర్కర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జి మాధవి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుమలత, తదితరులు

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఏటూరునాగారం, డిసెంబర్ 2 : మండలంలోని కోయగూడ ఎల్లాపూర్‌లో ఓడీసీఎంఎస్ ద్వారా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎంపీటీసీ సుమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి చల్లా రమాదేవి, బీఆర్ఎస్ నాయకులు గారె ఆనంద్, జయకృష్ణ, గుండెపు రాజు, వంగరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది

## ఏజెన్సీలో ముమ్మరంగా పోలీసుల తనిఖీ

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 2 : మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలో ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో వెంకటాపురం సర్కిల్ పరిధిలో అప్రమత్తమైన పోలీసులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతులు

## తుఫాన్ హెచ్చరికతో రైతుల అప్రమత్తం

మంగపేట, డిసెంబర్ 2 : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశముందని వాతావరణ కేంద్రం జారీ చేసిన హెచ్చరికతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే చాలా వరకు వానా కాలం వరి పంటను కోసి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు కాంటాలు వేసేందుకు ఆరబోసుకున్న ధాన్యాన్ని కుప్పలుగా చేసి పరదాలు కప్పుతూ వర్షానికి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు.



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీలు

## రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు విద్యార్థులు

ఏటూరునాగారం, డిసెంబర్ 2 : నిజామాబాద్ జిల్లా నందిపేటలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన బాలుర క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రాజు తెలిపారు. గత నెలలో వరంగల్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన క్రీడల్లో పాఠశాల నుంచి ఆనంద్, భూమయ్య, రిషి, అరవింద్ పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్‌ప్రిన్సిపాల్ రాజారాం, పీడీలు రమణ, శ్రీనివాస్ అభినందించారు.



తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద నీటితో కళకళలాడుతున్న గోదావరి

## సమ్మక్క బరాజ్‌లో పెరుగుతున్న నీటిమట్టం

కన్నాయిగూడెం, డిసెంబర్ 2 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద నీటిమట్టం పెరుగుతోంది. దీంతో గోదావరి నది జలకళను సంతరించుకొని చూపరులను ఆకట్టుకుంటోంది. శనివారం రెండు గేట్లను ఎత్తి 9 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. బరాజ్ వద్ద 80 మీటర్ల నీటి మట్టం ఉండేలా చూస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

## హేమాచలుడికి అభిషేక పూజలు

**స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు**

మంగపేట, డిసెంబర్ 2 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారికి శనివారం అభిషేక పూజా క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు స్వామివారిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు గుట్టకు తరలివచ్చి గర్భగుడి ముందు జరిపిన అభిషేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాజీ మంత్రికి స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



హారతి తీసుకుంటున్న భక్తులు

## క్షేత్రపాలకుడికి ఆకుపూజ

పాలకుర్తి, డిసెంబర్ 2 : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పాటిమీద కొలువుదీరిన క్షేత్ర పాలకుడు భక్త ఆంజనేయ స్వామికి శనివారం ఆకు పూజ పర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి గంగు రఘుశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, చందన లేపనం, తమలపాకుల పుష్పాలంకరణ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. దర్శనం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



తమలపాకులతో పూజలందుకున్న భక్త ఆంజనేయస్వామి



రామప్ప ఆలయంలో సందడి చేస్తున్న విద్యార్థులు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

## రామప్ప ఆలయంలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, డిసెంబర్ 2 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా పర్యాటకులు ఆసక్తిగా విన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆలయం ఆవరణలో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

## నేడు 144 సెక్షన్ అమలు

వెంకటాపూర్, డిసెంబర్ 2 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండలంలో ఆదివారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై చల్లా రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల లీడర్లు, ప్రజలు ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించొద్దని, డీజేలు ఉపయోగించరాదని, బాణసంచా కాల్చొద్దని తెలిపారు. నలుగురికంటే ఎక్కువ మంది గుమికూడవద్దని, ఎటువంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దన్నారు. ఫలితాల అనంతరం ఈసీ అనుమతితో విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

ఏటూరునాగారం, డిసెంబర్ 1 : మండలంలోని షాపల్లి గ్రామానికి చెందిన కుక్కల వెంకటయ్య (70) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. కాగా, ఆయన సోదరుడు కుక్కల లక్ష్మీనర్సయ్య అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన వివరాలిలా ఉన్నాయి. కుక్కల వెంకటయ్య తరచూ మద్యం సేవిస్తూ కుమారుడు శంకర్, కోడలు అనితతో గొడవపడేవాడు. శుక్రవారం సాయంత్రం కూడా మద్యం తాగి గొడవ పెట్టుకున్నాడు. గొడవ పడుతున్న వెంకటయ్యను తన మనుమరాలు అతని గదిలో పడుకోబెట్టింది. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుమారుడు శంకర్ లేచి చూడగా వెంకటయ్య ఉరేసుకుని కన్పించడంతో కిందకు దించి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు.